## పదోతరగతి టాపర్లకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్(పా)

కొత్తగూడెం సింగరేణి, మే 10: స్థానిక సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల పదోతరగతిలో టాపర్‌గా నిలిచిన ఐదుగురిని డైరెక్టర్(పా) వెంకటేశ్వర్లు శనివారం అభినందించారు. సింగరేణి ఆధ్వర్యంలోని తొమ్మిది పాఠశాలల్లో పదోతరగతి చదివిన 500 మంది విద్యార్థుల్లో 53 మంది.. 500కు పైగా మార్కులు సాధించారని సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్ తెలిపారు. టాపర్లుగా నిలిచిన అష్మిత, ఆలియా తన్వీర్, సనా, విశాల్, యువన్, వర్ధన్‌ను డైరెక్టర్(పా) అభినందించారు. ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త కార్యదర్శి సునీల్‌కుమార్, ఎస్వోటు డైరెక్టర్(పా) సుశీల్ కుమార్, సింగరేణి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, సీనియర్ ఉపాధ్యాయులు ప్రతాప్, పూల్‌సింగ్ పాల్గొన్నారు.

## 'సింగరేణి'ని సందర్శించిన ఎంపీ


డైరెక్టర్‌తో, అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

కొత్తగూడెం సింగరేణి, మే 10: కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని శనివారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సందర్శించారు. డైరెక్టర్(పా) వెంకటేశ్వర్లుతో, జీఎంలతో మాట్లాడారు. నూతన బొగ్గు గనుల ప్రారంభం, సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో తగినంతమంది డాక్టర్ల నియామకం, ఉద్యోగులకు సౌకర్యాల కల్పన, సింగరేణి సీఎస్ఆర్ నిధులతో సమీప గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు తదితరాంశాలపై చర్చించారు.

## కొత్తగూడెం రైల్వేస్టేషన్ తనిఖీ

కొత్తగూడెం టౌన్, మే 10: కొత్తగూడెం రైల్వే స్టేషన్‌ను ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి శనివారం తనిఖీ చేశారు. రైల్వే అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు.

## సీతానగరంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



విగ్రహ ప్రతిష్టలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

పర్ణశాల, మే 10: దుమ్ముగూడెం మండలం సీతానగరం గ్రామంలో శ్రీలక్ష్మి భూలక్ష్మి సమేత శ్రీనాభిశిల బొడ్రాయి, దుర్గాదేవి అమ్మవారు, ముత్యాలమ్మ తల్లి సమేత శ్రీ పోతురాజు స్వామి అమ్మవార్ల స్థిర యంత్ర విగ్రహ ప్రతిష్టా మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సాయుధ దళాల ధైర్యసాహసాలు దేశానికి గర్వకారణం

మణుగూరు, మే 10: మన దేశ సాయుధ దళాలు ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు చేస్తున్న ధైర్య సాహసాలు గర్వకారణమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడుతున్న వీర జవాన్లకు సంఘీభావం తెలుపుతూ నెల వేతనాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళం అందజేస్తున్నామన్నారు.

## జనావాసాల్లోకి దుప్పి


పరుగెడుతున్న దుప్పి

లక్ష్మీదేవిపల్లి, మే 10: అడవిలో ఉండాల్సిన దుప్పి.. దారి తప్పి, జనావాసాల్లోకి వచ్చింది. శుక్రవారం రాత్రి స్థానిక శ్రీనగర్ కాలనీలోకి ప్రవేశించింది. దానిని పట్టుకునేందుకు కొందరు యువకులు ప్రయత్నించారు. ఆ దుప్పి ఎవరికీ చిక్కకుండా పరుగెత్తింది. దానిని కొందరు వెంబడిస్తూ వీడియో తీశారు.

## అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

ఇల్లెందు, మే 10: అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకున్నారు. సీఐ బి.సత్యనారాయణ తెలిపిన వివరాలు.. ఇల్లెందు సుభాస్‌నగర్‌కు చెందిన మహ్మద్ తాజుద్దీన్, కారేపల్లికి చెందిన నసీముద్దీన్ కలిసి ఆళ్లపల్లి మండలం నుంచి ఇల్లెందుకు ట్రాలీపై రెండు ఎద్దులను శనివారం అనుమతి లేకుండా తరలిస్తున్నారు. వీటిని ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం గ్రామ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. ఆ రెండు ఎద్దులను పాల్వంచలోని గోశాలకు తరలించారు.

# ప్రమాదకరంగా తూరుబాక కల్వర్టు

**దుమ్ము రేపుతున్న డైవర్షన్ రహదారి**
**ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు**


తూరుబాక వద్ద కుంగిపోయి ప్రమాదకరంగా మారిన కల్వర్టు


తూరుబాక వద్ద దుమ్ములేపుతున్న డైవర్షన్ రహదారి

దుమ్ముగూడెం, మే 10 : మండల పరిధిలోని భద్రాచలం- చర్ల ప్రధాన రహదారిపై తూరుబాక వద్ద కల్వర్టు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. కల్వర్టు కుంగిపోవడంతో పక్కనే డైవర్షన్ రహదారిని ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డుపై వాహనాలు వెళ్తుంటే భారీగా దుమ్ములేచి వెనుక వచ్చే వాహనదారులకు ఇబ్బందిగా మారుతున్నది. అంతేకాదు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ఈ కల్వర్టు కుంగిపోయి పదినెలలు గడుస్తున్నా నేటికీ అధికారులు ఎలాంటి మరమ్మతులు చేపట్టకుండా చోద్యం చూస్తున్నారు. ఈ కల్వర్టు వద్ద గతంలో పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.. ఒకరు మృత్యువాత కూడా పడ్డారు. గత మార్చి 14వ తేదీన ఈ కల్వర్టును బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుతో పాటు పలువురు నాయకులు పరిశీలించారు. ఆ సమయంలో ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరినప్పటికీ నేటికీ పరిష్కారం కాకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు మండిపడుతున్నారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుది దుమ్ముగూడెం మండలమే. సమస్యను స్థానిక ప్రజలు ఆయనకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఏమాత్రం చలనం లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని, అప్పటివరకు డైవర్షన్ రహదారిపై దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

### పదినెలలైనా పట్టించుకోవడం లేదు..



తూరుబాక వద్ద కల్వర్టు కుంగిపోయి ప్రమాదకరంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన రహదారిగా ఉన్నప్పటికీ దీనికి మరమ్మతులు జరగడం లేదు. పదినెలలైనా సమస్య అలాగే ఉంది. వాహనదారులు రాత్రి సమయాల్లో ప్రమాదాల బారినపడుతున్నారు. అధికారులు శ్రద్ధ చూపి సమస్యను వెంటనే పరిష్కరించాలి. **– రావులపల్లి పృథ్వీ, నర్సాపురం, దుమ్ముగూడెం**

# డిప్యూటీ సీఎం ఎందుకు రాలేదంటే..!


చంద్రుగొండ : బోరు బావి కోసం ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంట్


బెండాలపాడులో కూలిన ఇందిర సౌర గిరి వికాస పథకం సోలార్ విద్యుత్ బోరు

చంద్రుగొండ, మే 10: మండలంలోని బెండాలపాడులో శనివారం జరగాల్సిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన ఎందుకు రద్దయింది..? ఆయన ఎందుకు రాలేదు..? దీనిపై మండలంలో ఇలా చర్చ సాగుతున్నది- ఇందిర గిరి సౌర వికాస పథకం అమలుకు నమూనాగా చంద్రుగొండ మండలంలోని బెండాలపాడు గ్రామాన్ని ప్రభుత్వం ఎంపిక చేసింది. పూర్తి సబ్సిడీతో పోడు రైతులకు సోలార్ విద్యుత్ అందించడం ఈ పథకం లక్ష్యం. బెండాలపాడు గ్రామంలోని పోడు రైతులు పద్దం వెంకటేష్, రేసు నరసింహులును ఎంపిక చేసింది. వీరి పోడు భూములను అభివృద్ధి చేసేందుకు ఇందిర సౌర గిరి వికాస పథకం కింద రూ.6లక్షల చొప్పున మొత్తం రూ.12లక్షలను మంజూరు చేసింది. బోరు బావి ఏర్పాటు, సోలార్ విద్యుత్ ప్లాంట్, సోలార్ ఫెన్సింగ్ పనులు.. ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణలో పూర్తయ్యాయి. ఈ నెల 10న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించాల్సి ఉంది. ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఇంతలోనే, ఈ రెండు బోరు బావుల్లో ఒకటి కూలిపోయింది. మరో బోరు మోటర్ నుంచి నీళ్లు రావడం లేదు. ఈ విషయాన్ని అధికార పార్టీ నాయకులు, జిల్లా అధికారులు రహస్యంగా ఉంచారు. డిప్యూటీ సీఎం పర్యటనను రద్దు చేయించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకం అమలు.. ఆదిలోనే ఎందుకు అభాసుపాలు అయింది..? దీనికి కారణాలేమిటి.. కారకులెవరు..? తేల్చేదెవరు.. తేలేదెప్పుడు..?

### 'మాకేం సంబంధం లేదు..'

ఈ పథకం అమలుతో తమకు ఏమాత్రం సంబంధం లేదని ఎంపీడీవో అశోక్ చెప్పారు. ఆయనను 'నమస్తే' వివరణ కోరగా.. ''ఇందిర గిరి సౌర వికాస పథకం అమలు కార్యక్రమం పూర్తిగా ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణలో జరిగింది. దీంతో మా మండల అధికారులకు ఎటువంటి సంబంధం లేదు'' అని స్పష్టం చేశారు.

## విద్యుత్ సబ్ స్టేషన్లకు శంకుస్థాపన

అశ్వారావుపేట, మే 10: అశ్వారావుపేట, దమ్మపేట మండలాలకు మంజూరైన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లకు స్థానిక పామాయిల్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో వారు మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన-చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను డిప్యూటీ సీఎం భట్టి వివరించారు. అశ్వారావుపేట నియోజకవర్గానికి మొదటి విడతగా 3,500 ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి పొంగులేటి చెప్పారు. మరికొన్ని ఇళ్లు కూడా మంజూవుతాయన్నారు. ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, రాందాస్ నాయక్, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జవాన్ మురళీనాయక్‌కు నివాళి


మురళీనాయక్‌కు సీపీఐ ఆధ్వర్యంలో నివాళి

భద్రాచలం, మే 10: దేశరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన భారత సైనికుడు మురళీనాయక్ కుటుంబానికి అందరూ అండగా నిలవాల్సిన బాధ్యత మనపై ఉందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రావులపల్లి రవికుమార్ అన్నారు. శనివారం భద్రాచలంలో సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మురళీనాయక్‌కు ఘన నివాళులర్పించారు. మురళీనాయక్‌తో పాటు అమరవీరుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పలువురు పాల్గొన్నారు.

టేకులపల్లి, మే 10: యుద్ధ భూమిలో వీర మరణం పొందిన ఆర్మీ జవాన్ ఎం.మురళీనాయక్ సంస్మరణ కార్యక్రమాన్ని మండలంలోని బొమ్మపల్లి విద్యుత్ కార్యాలయంలో ఏఈ బుజ్జి కన్నయ్య శనివారం నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి, కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. సిబ్బంది దేవ్‌సింగ్, శరణ్, ఎస్‌కె.పాషా, యాకూబ్ పాషా, నాగుల్ మీరా, శ్రీనివాస్ చారి, లచ్చు, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న బుజ్జి కన్నయ్య

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణతులసి పూజలు


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, మే 10: భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామి వారి ఉత్సవమూర్తులకు శనివారం అర్చకులు స్వర్ణతులసి పూజలు జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పారదర్శకంగా జరగాలి

### బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు మానే రామకృష్ణ



భద్రాచలం, మే 10: ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియ అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ నాయకులు మానే రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే, అనుచరులు అన్ని మండలాల్లో తమ స్వార్థ ప్రయోజనాల కోసం జాబితా తయారుచేసి ఆ జాబితానే అధికారులు ఆమోదించాలని వత్తిడి తెస్తూ అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఇది మంచిపద్ధతి కాదన్నారు. ఇటీవల జరిగిన గృహ నిర్మాణశాఖామంత్రి భద్రాచలం పర్యటనలో ప్రజల నుంచి మండలంలో నిరసన వ్యక్తమైందని, లబ్ధిదారుల ఎంపికలో ఎంత అవినీతి జరిగిందో అదే ఉదాహరణగా అభివర్ణించారు. జాబితా విషయంలో అధికారులు సర్వేచేసి నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు.

## బూర్గంపహాడ్ తహసీల్దార్‌గా వివేక్



బూర్గంపహాడ్, మే 10: బూర్గంపహాడ్ మండల నూతన తహసీల్దార్‌గా వివేక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ముజాహిద్ కలెక్టరేట్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో పాల్వంచ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వివేక్ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## పల్లెల్లో సమస్యలు పరిష్కరించాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

అశ్వాపురం, మే 10: పల్లెలే మా పాఠశాలలు.. ప్రజలే మా గురువులు.. అనే నినాదంతో మే 6 నుంచి 13వ తేదీ వరకు పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గం పిలుపుమేరకు పీడీఎస్‌యూ రాష్ట్ర బృందం మండలంలో పలు గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ కూలీలను కలిసి 10 సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు మర్రి మహేష్ మాట్లాడుతూ.. జిల్లాలో అనేక ఆదివాసీ గ్రామాలు నేటికీ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. రోడ్డు, కరెంటు సౌకర్యం అందని గ్రామాలకు కనీస సౌకర్యాలు తీర్చాలన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో రాష్ట్రంలో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసగించిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు రాగిణి, అరుణ, కిరణ్, గాంధీ, భాను తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

రామవరం, మే 10: సింగరేణి ఇంటర్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ క్రికెట్ టోర్నమెంట్ రెండవ రోజు కొనసాగింది. మొదటి మ్యాచ్‌లో కొత్తగూడెం రీజియన్‌పై కొత్తగూడెం కార్పొరేట్, రెండో మ్యాచ్‌లో కొత్తగూడెం రీజియన్‌పై రామగుండం రీజియన్ గెలిచాయి.

## లైంగిక వేధింపుల నివారణపై శిక్షణ


శిక్షణలో పాల్గొన్న ఉద్యోగులు

కొత్తగూడెం సింగరేణి, మే 10: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణపై సంబంధిత అధికారులకు, ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని జీఎం రఘుపతి శనివారం ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. హిందూస్తాన్ అకాడమీ ఆఫ్ లా (విశాఖపట్నం) ప్రొఫెసర్ పార్వతీశం శిక్షణ ఇచ్చారు.




## నేడు విద్యుత్ అంతరాయం

ఇల్లెందు, మే 10: ఇల్లెందులోని వివిధ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అదనపు సహాయక ఇంజినీర్ (ఆపరేషన్ సెక్షన్) ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్ జైలు ఏరియా, సర్ఫిట్ బస్తీ, ఎమ్మార్వో కార్యాలయం, గోవింద్ సెంటర్, డీఎస్పీ ఆఫీస్, స్టేషన్ బస్తీ, రాజీవ్ నగర్ తండా ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. వినియోగదారులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

## ఆటోను ఢీకొన్న కారు

పాల్వంచ రూరల్, మే 10: ఆటోను కారు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పుల్లాయిగూడెం గ్రామస్తుడు కొండ్రు భద్రయ్య, తన ఆటోలో శుక్రవారం భద్రాచలం వెళుతున్నాడు. రంగాపురం వద్ద భద్రాచలం నుంచి వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి, భద్రయ్య ఆటోను ఢీకొంది. భద్రయ్య చేతులకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నది. చికిత్స అనంతరం శనివారం రూరల్ పోలీసులకు భద్రయ్య ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ జరిపి, వరంగల్ జిల్లా పాపయ్యపల్లికి చెందిన కారు డ్రైవర్ ముదురుకాళ్ళ విద్యాసాగర్‌పై కేసు నమోదు చేశారు. దర్యాప్తు జరుపుతున్నారు.

## ఇంకుడు గుంతలు నిర్మించాలి

అశ్వారావుపేట, మే 10: అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంకుడు గుంతలను కచ్చితంగా నిర్మించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లను డీడబ్ల్యూవో లెనినా ఆదేశించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం ఆమె సమీక్షా సమావేశంలో మాట్లాడారు. వేసవిలో చిన్నారులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. సీడీపీవో ముత్తమ్మ, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నాదేళ్ళ సౌజన్య, వరలక్ష్మి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## సంక్షిప్తం

### పాల్వంచ తహసీల్దార్‌గా ప్రసాద్

పాల్వంచ రూరల్, మే 10: పాల్వంచ తహసీల్దారుగా దారా ప్రసాద్ నియమితులయ్యారు. ఆయన మంగళవారం విధుల్లో చేరతారు. ఆయన ఇప్పటివరకు కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగంలో పనిచేశారు. ఇక్కడి తహసీ వివేక్.. బూర్గంపాడుకు బదిలీ అయ్యారు.

### సీహెచ్‌పీ మ్యాన్ పవర్ పెంపునకు వినతి

ఇల్లెందు, మే 10: సీహెచ్‌పీ మ్యాన్ పవర్ పెంచాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇన్‌చార్జ్ డీవైజీఎం క్రిష్టఫర్‌కు ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్ శనివారం వినతిపత్రం ఇచ్చారు. నాయకులు మహ్మద్ యాకూబ్, వజ్రాల అప్పిరెడ్డి, సంతోష్‌కుమార్, కుమార్, రాజలింగం, కుమారి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

### రేపు 'రైతు ముంగిట్లోకి శాస్త్రవేతలు'

అశ్వారావుపేట రూరల్, మే 10: మండలంలోని నారంవారిగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద 'రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఈవో సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రైతులంతా హాజరుకావాలని కోరారు.

### కిడ్నీ వ్యాధి బాధితుడికి ఆర్థిక సాయం

ములకలపల్లి, మే 10: మండలంలోని తాల్లపాయ గ్రామస్తుడు సడియం వెంకటేశ్వర్లు.. మూడేళ్ల నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆయన వైద్య ఖర్చుల కోసం కుమార్తె రంజితకు బీఆర్ఎస్ నాయకుడు తాటి వెంకటేశ్వర్లు శనివారం రూ.5వేలు అందించారు. నాయకులు బండి కొమరయ్య, రాజేష్, నాగరాజు పాల్గొన్నారు.

### 20న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

దమ్మపేట, మే 10: కార్మిక హక్కులను హరిస్తున్న లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 20న సార్వత్రిక సమ్మెను కార్మికులంతా జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ కోరారు. సమ్మెను జయప్రదం చేయాలని దమ్మపేటలో శనివారం ప్రచారం నిర్వహించారు. నాయకులు కొప్పుల శ్రీను, సూరి, పోలరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

### ఇల్లెందు ఏరియా ఆసుపత్రి సందర్శన

ఇల్లెందు, మే 10: సింగరేణి ఇల్లెందు ఏరియా ఆసుపత్రిని చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.కిరణ్ రాజ్‌కుమార్.శనివారం సందర్శించారు. వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు. రికార్డులను, మందుల నిల్వలను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రిని పరిశీలిస్తున్న చీఫ్ మెడికల్ ఆఫీసర్

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
FINANCIAL SERVICES
★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491- All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.